క్లుప్తంగా

కోర్టు సముదాయాన్ని అభివృద్ధి చేయండి



మంత్రి సబితారెడ్డిని కలిసిన బార్ అసోషియేషన్ సభ్యులు

చేవెళ్ల: చేవెళ్ల కోర్టు సముదాయాన్ని అభివృద్ధి చేయాలని బార్ అసోషియేషన్ నాయకులు మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలను కోరారు. శనివారం మంత్రి సబితారెడ్డి, ఎంపి డాక్టర్ రంజిత్‌రెడ్డిలను వారి నివాసాల వద్ద వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్లకు అడిషనల్ జూనియర్ కోర్టు ఏర్పాటు చేయటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు సముదాయంలో భవనాలు, కనీస సౌకర్యాలు కల్పించాలని న్యాయవాదులు వారిని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారన్నారు. వారిని కలిసిన వారిలో చేవెళ్ల బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాంరెడ్డి, శంషోద్దీన్, ఉపేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, సురేశ్, లక్ష్మినర్సింహారెడ్డి, సుదర్శన్, సందీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ



ప్రధానోపాధ్యాయుడికి నోటుపుస్తకాలను అందిస్తున్న అశోక్‌గౌడ్

కేశంపేట: గ్రామ పంచాయతీ పరిధిలో రాగ్య తండాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మద్దూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ దాతలు ఇస్తున్న సహకారంతో విద్యార్థులు బాగా చదువుకొని రాణించాలన్నారు. రాజు నాయక్, తులసీరాం, శ్రీను నాయక్, అనిల్ నాయక్, శంకర్ పాల్గొన్నారు.

'నవ నిర్మాణ్' వెలుగులు



శంకర్‌పల్లిలో హైమాస్ట్ దీపాల వెలుగులు

శంకర్‌పల్లి: కొత్తగా బిగించిన హైమాస్ట్ లైట్లతో పట్టణ కేంద్రం కొత్త వెలుగులు సంతరించుకుంది. జాతీయ జెండా రంగులలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన చౌరస్తా నుంచి బుల్కాపురం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర లైట్లు ఏర్పాటు చేశారు. అలాగే నార్సింగి పట్టణ కేంద్రంలో రెండు కిలో మీటర్లు బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పేరుతో నవ నిర్మాణ్ అసోసియేషన్ సొంత నిధులు రూ.1.57 కోట్లతో పనులు నిర్వహించారు. ఆర్అండ్‌బీ అనుమతులు తీసుకుని చేపట్టిన పనులపై మున్సిపల్ ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్



మాట్లాడుతున్న మనోహర్

కేశంపేట: విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌ఛార్జి విద్యాధికారి మనోహర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్, టీచర్ల సమావేశాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీపీఎం సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మండల నోడల్ అధికారి గోపాల్‌నాయక్, శ్రీనివాసరావు, శ్రీనివాససాగర్, సాయిప్రసాద్, సుజాత, శిరీష, కృష్ణయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానం

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం చిలుకూరులోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను సామాజిక అంశాలను, పర్యావరణ హితానికి ఉపయోగించుకోవాన్నారు. పర్యావరణ హితంకోసం మట్టి వినాయకులను తయారు చేసి చూపించారు. కళాశాల డీన్ మధుసూదన్‌నాయర్, ప్రిన్సిపాల్ విజయలత, హెచ్ఓడీ సంధ్య పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడ.. సమస్యల దడ !

- ధ్వంసమైన రోడ్లు, వెలగని లైట్లు
- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన షెడ్లు
- విశ్రాంతి గదుల్లేక కార్మికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పారిశ్రామిక వాడలోని షెడ్లు

కొత్తూరు: వెనుకబడిన జిల్లా.. పాలమూరు.. ఇక్కడ వలసలను నియంత్రించే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో కొత్తూరు మండలకేంద్రంలో 1976లో పారిశ్రామిక వాడను ఏర్పాటుచేశారు. ప్రారంభంలో సుమారు 60నుంచి 80 వరకు చిన్న, పెద్ద పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతంలో రోడ్డు, రైలు, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచారు. భాగ్యనగరానికి అతి దగ్గరగా ఉండడంతో రెండేళ్ల లోపే వందల్లో పరిశ్రమలు విస్తరించాయి. ఉపాధి అవకాశాలు పెరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్ లారీలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ సందర్భంగా కార్మికులతో పారిశ్రామిక వాడ నిత్యం కిటకిటలాడేది. బిహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల కార్మికులు ఉపాధి నిమిత్తం మండలానికి వచ్చేవారు. గత కొన్నేళ్ల నుంచి ఆయా కారణాలతో పలు పరిశ్రమలు మూతపడ్డాయి. మరికొన్ని కాలుష్యం కారణంగా మరో చోటుకు తరలిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గాయి.

పెరిగిన సమస్యలు..

- ప్రస్తుతం పారిశ్రామికవాడలో చాలా షెడ్ల నిర్వహణ కరువై శిథిలావాస్థకు చేరాయి.
- అంతర్గత రోడ్లకు కొన్నేళ్ల నుంచే కనీస మరమ్మతులు లేక గుంతలమయంగా మారాయి. వర్షాకాలం వస్తే ఇక అంతే సంగతులు, రాకపోకలు, వాహనదారులకు ఇబ్బందులతో పలు సమస్యలు దడ పుటిస్తున్నాయి.
- ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడి పరిశ్రమలకు సరుకులు తీసుకొచ్చే క్రమంలో డ్రైవర్లు, కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేవు.
- తాగునీరు, టాయిలెట్స్ లేక కార్మికులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యంగా వీధి దీపాల్లేక పారిశ్రామికవాడలోని అంతర్గత రోడ్లపై చీకట్లు అలుముకుంటున్నాయి.

గత వైభవం వచ్చేనా ?

ప్రస్తుతం కొత్తూరు మండలం హెచ్ఎండీఏ పరిధిలోకి రావడంతో హైదరాబాద్ సమీపంలోని చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు మండలంలో పరిశ్రమలను నెలకొల్పే ప్రయత్నంలో ఉన్నారు. కొందరు వీటి ఏర్పాటుకు భూములను సైతం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను కూడా సత్వరమే జారీచేయాలని సూచిస్తున్నారు.

> **కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి..**
>
> పరిశ్రమల్లో కనీస సౌకర్యాలు లేని కారణంగా డ్రైవర్లు రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. దానికి తోడు హమాలీలు, కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశ్రామికవాడలో విశ్రాంతి గదులు, తాగునీరు, వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.
>
> – పర్వతాలు, ఏఐటీయూసీ, జిల్లా అధ్యక్షుడు

ఓటుతోనే దేశ ప్రగతి: ఆర్డీఓ



చేవెళ్ల: 5కె రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ సాయిరాం

- చేవెళ్లలో 5కె రన్

చేవెళ్ల: ఓటుతోనే దేశ ప్రగతి సాధించొచ్చని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం పేర్కొన్నారు. శనివారం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహనలో భాగంగా 5కె రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటహక్కు ఉన్నవారు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నా సరిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు క్రిష్ణయ్య, రాజశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్, ఏఎస్ఐ చందర్‌నాయక్, ఆగిరెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: అర్హులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. పట్టణంలో ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మినీ స్టేడియం నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కమిషనర్ వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి సోకితే భయపడొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: కుష్టువ్యాధి సోకితే భయపడొద్దని, సకాలంలో మందులు వాడితే నయమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. చించోడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో శనివారం డాక్టర్ షేక్‌ముస్తాఫిన్ అహ్మద్‌తో కలిసి ఆమె ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే సులువుగా నయం చేయొచ్చన్నారు. ఎంతమంది కుష్టు రోగులు ఉన్నారు? ఎంతమంది మందులు వాడుతున్నారనే విషయాలను సర్వే అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఇది వంశపారంపరంగా రాదని, మైక్రో బ్యాక్టీరియ లెప్రే అనే సూక్ష్మ క్రిమి ద్వారా సోకుతుందన్నారు. ఈ కార్యక్రమంలోహెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే

పల్లెబాటలో నరేందర్‌రెడ్డి



బీజేపీ పథకాలను వివరిస్తున్న నరేందర్‌రెడ్డి

కేశంపేట: కేంద్రంలో, రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమని సాంస్కృతికశాఖ జిల్లా కోకన్వీనర్ కారేడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నిర్వహించిన పల్లెబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంతాపూర్ గ్రామంలో ప్రతీ గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నేరవేర్చలేదని గ్రామస్థులతో చెప్పారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్లుగా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి అధికారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహాయాదవ్, శివానంద్, మహేశ్, రాజలింగం, నాగరాజు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ హరిత



సర్టిఫికెట్లను అందజేస్తున్న హరిత

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ ఎం హరిత అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే, పివి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కళాశాలలో టాపర్లుగా నిలిచిన నిఖిత, దీక్షితలను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగాలకే పరిమితం కాకుండా సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. ఆక్సేవర్ టెక్నాలజీ సంగీత్‌సేన్, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా రెడ్డి, డీన్ డాక్టర్ పద్మజా, అకాడామిక్ కోఆర్డినేటర్ శ్రీలత, ఏవో వెంకటాచలం, గ్రాడ్యుయేషన్ కన్వీనర్ డాక్టర్ వివి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఐకి రివార్డు అందజేత



డీసీపీ నుంచి రివార్డు అందుకుంటున్న ఎస్ఐ వరప్రసాద్

కేశంపేట: తులవానిగడ్డ వద్ద వారం రోజుల క్రితం మహిళ మెడలో పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని గుర్తించి పట్టుకున్నందుకు శనివారం ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్‌కు శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి రివార్డును అందజేశారు. కేసు ఛేదనలో కృషి చేసిన ఎస్ఐతో పాటు శివ, రవి, అశోక్‌రెడ్డి, శివదత్త, సాయిలకు కూడా అందజేశారు. రివార్డు పొందిన వారిని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ లక్ష్మిరెడ్డి తదితరులు అభినందించారు.

కాంగ్రెస్ వస్తే యువతకు ఉజ్వల భవిష్యత్



గడపగడపకు ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ అధికారంలోకొస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి హర్ప్రీత్‌చౌహాన్ అన్నారు. శనివారం గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా భగత్‌సింగ్‌కాలనీ, సీపీఐ కాలనీలో ఇంటింటికీ ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమరవీరుల కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.25వేలు గౌరవ పెన్షన్ అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు భర్తీ , జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతి రూ.4వేలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇందరిమ్మ , రైతు భరోసా పథకం ద్వారా భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ.15వేలు, తదితర పథకాలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. యూత్ ఇన్‌చార్జి చైతన్య క్రిష్టారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కృష్ణంరాజు, యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు సమత, సర్పంచ్ శైలజ, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక తీజ్

జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



తీజ్ ఉత్సవాల్లో తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి

కేశంపేట: సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక తీజ్ అని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. శనివారం కాంకిరాళ్లతండాలో గిరిజనులు తీజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి గిరిజన యువతులతో కలిసి ధాన్యం బుట్టను నెత్తిన పెట్టుకొని ఆడిపాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెళ్లి కాని యువతులు తమ సంప్రదాయాన్ని అనుసరించి తీజ్‌ను జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్‌నాయక్, బీజేపీ నాయకుడు మిధున్‌రెడ్డి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరగని జ్ఞాపకం.. ఫొటో..!

చేవెళ్ల: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పితామహుడు శ్రీలూయిస్ బ్యాకురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు కురువ మల్లేశం, పాండు, శంకర్, బాలు, తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌లో..

పాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షాబాద్‌లో.. ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు గుర్తుంచుకోవచ్చని ఫొటో గ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు కుర్వ మల్లేష్ అన్నారు. లూయిస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గౌరవ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన లలితకు మంజూరైన రూ. 60 వేల చెక్కును శనివారం ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన వారు ఆయా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, మెండె కృష్ణ, రవీందర్‌రెడ్డి, భీమయ్య, లింగంనాయక్, జైపాల్, యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని వినతి

- ట్రస్టు భూములను సందర్శించిన అఖిలపక్షం నేతలు



ట్రస్టు భూములను పరిశీలిస్తున్న అఖిల పక్షంనేతలు

నందిగామ: అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతు అఖిలపక్షం నేతలు నయాబ్ తహసీల్దారు విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నందిగామ శివారులోని వెంకట్‌రావు మెమోరియల్ ట్రస్టు భూములను శనివారం అఖిల పక్షం నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ ట్రస్టు భూములను అక్రమంగా అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, వాటికి సహరించిన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, టీడీపీ జాతీయ కార్యదర్శి బక్కని నర్సింహులు, సీపీఐ కార్యదర్శి సాంబశివరావు, కొమ్ము కృష్ణ, జంగ నర్సింహా యాదవ్, చంద్రపాల్ రెడ్డి, లింగం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయమే శిరోధార్యం

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం కేసీఆర్‌దే తుది నిర్ణయమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంపై కొన్ని రోజులుగా మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో అనేక వార్తలు వస్తున్నాయని అన్నారు. ఈ విషయంలో నియోజకవర్గ ప్రజలు, అభిమానులు అయోమయానికి గురికావద్దన్నారు. అభ్యర్థులను ఇంకా సీఎం కేసీఆర్ ప్రకటించలేదని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను నమొద్దన్నారు. త్వరలో అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారన్నారు. గతంలో తను ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం, షాద్‌నగర్‌లో అన్ని పార్టీల నేతల మద్దతు తనకు ఉందని, బీఆర్ఎస్ నుంచి తనకే టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని, మూడో సారి కేసీఆర్ సీఎం పదవి చేపట్టనున్నట్లు జోస్యం చెప్పారు.

భూములను అప్పగించాలని ధర్నా



బాధిత రైతులకు మద్దతుగా ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: దామరగిద్ద సమీపంలో ఆర్టీసీ డిపో కోసం ప్రభుత్వం సేకరించిన భూముల వద్ద బాధిత రైతులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో నిర్మాణం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇక్కడ భూమి సేకరిస్తే ప్రభుత్వం నేటికీ ఆర్టీసీడిపో మంజూరు చేసి నిర్మాణం చేయలేకపోయారని మండిపడ్డారు. ఇక్కడ డిపో నిర్మాణం జరిగితే బాధిత రైతుకుటుంబాలకు ఉద్యోగాలు వస్తాయని కొండంత ఆశతో ఉన్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ డిపో నిర్మాణం చేయకపోగా ప్రహరీ నిర్మిస్తోందన్నారు. దీందో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు సాగులేక ఉద్యోగం లేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిపో నిర్మాణం చేయకపోతే బాధిత రైతులకు తమ భూములను తిరిగి ఇచ్చేయాలని వారు కోరారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, వెంకటేశ్‌బాబు, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.